# ఆమె త్యాగం నాకు నచ్చిన కథ-

వాడ్రేవు వీరలక్ష్మీదేవి

చలంగారి రచనలన్నీ చదవేక, మళ్లీ మళ్లీ, చదివేక, చాలా కాలం దాకా 'అమె త్యాగం' కథ చదవడం పడలేదు. ఈ మధ్యనే రెండు, మూడేళ్లక్రితం ఆ కథ మొదటిసారిగా **చదువుతుంటే** ఆగకుండా కన్నీళ్లు చదువుతున్నంతసేపూ, సౌందర్యము, ప్రేమ, దయ మూడు విడదీయలేనంతగా కలిసిపోయిన ఒక చల్లని వెలుగు ఆ కథ లోంచి హృదయాన్ని - తిరిగి ఎప్పటికీ ఘనీభవించనట్టుగా - కరిగించి కదిల్చి వెయ్యడం అనుభవించాను. ఇప్పటికే చదవని నాలాంటి పాఠకులెందరో ఉండి ఉంటారని - వాళ్లు ఈ గొప్ప అనుభూతి కోల్పోకూడదని ఈ కథని ఇక్కడ ఇలా పరిచయం చేస్తూ -

శతజయంతి సభలలో తిరుపతిలో ఒక ప్రశ్న అడిగారు. చలం స్త్రీలు ఎక్కడయినా ఉన్నారా? ఎలా ఉంటారు? అని ఆ ప్రశ్న విని నాకు చాలా జాలి కలిగింది. చలం తాను తన చుట్టూ చూసిన ఎందరో స్త్రీల గురించే ఇంత సాహిత్యమూ వ్రాసారు. అభూత కల్పనలు ఏవీ లేవు. కానీ ఆ 'చూపు' మనకి లేక పోయిందే అని, లోకం చూసే చూపుకాక తనదైన, దయా పూరితమయిన, సౌందర్య భరితమైన ఒక సూనృతపు దృష్టి ఆయనది ఆయన సాహిత్యం చదవడం వల్ల మిగిలిన వారికి కూడ స్త్రీల పట్ల అటువంటి దృష్టి అలవడాలన్నిదే ఆయన లక్ష్యం. ఆ విధంగా స్త్రీలను గుర్తించగల వ్యక్తులు లేకపోలేదు. వారి స్త్రీప్రేమ, ఆరాధన లోకానికి వేరే విధంగా కనబడినప్పుడు దానికి అర్థం చెప్పడానికి కూడా ఆయన ఇన్ని కథలు వ్రాశారని అనిపిస్తుంది.

ఈ కథలో 'ఆమె'కు పేరులేదు. కాని ఆమెలోని సౌందర్యం - మంచితనంతో ప్రేమతో, దయతో, శుచితో నిండి- ఒక పవిత్రతను ఆ పరిసరాలనిండా వ్యాపింప చెయ్యడం మనమూ ఫీల్ అవుతాం. ఇవన్ని చివరకు ఒక త్యాగంలోకి పర్యవసించడంతో కథ ముగిసి మనం ఎంతో బెంగపడతాం. 'ఆమె' కోసం.

లైంగిక స్వేచ్ఛ అన్నమాట ఆరోజు చలంగారు వాడినా ఈ రోజు స్త్రీవాదులు వాడినా జనం భరించలేకపోతున్నారు. అనేక విధాల భయపడిపోతున్నారు. తన శరీరం ఇష్టపడని అనుభవాన్ని వద్దనడానికి, కావాలన్న దాన్ని పొందడానికి వెనుక ఆ స్త్రీ మనసు పడుతోన్న హింస గురించి ఎవరు ఆలోచించగలరు? నిరంతరం అటువంటి హింస అనువించే మనసు ఏ చైతన్యం వేపు వికసించగలదు? ఇవి బలమైన ప్రశ్నలు. లైంగిక స్వేచ్ఛ ప్రకటించుకున్న స్త్రీమీద సమాజం ఒకే ముద్రవేస్తుంది. అటువంటి పరిస్థితిలోకి బలంగా నెట్టబడిన స్త్రీకి విముక్తిలేదు. ఇటువంటి సామాజిక నీతి సూత్రాల మీద నుంచి వాటిని ఎడమ కాలితో తన్నుతో ఒక కొత్త నీతిని, ప్రేమను సౌందర్యాన్ని, త్యాగాన్ని అన్నింటినీ ఈ కథలు నింపి- శుచికి పాతివ్రత్యానికి కొత్త అర్థాలను కల్పించారు చలం.

ఒక సభలో మాట్లాడుతూ వావిలాల సుబ్బారావుగారు అన్నారు. 'ఆమెత్యాగం' కథ చదువుతూ ఉంటే కన్నీళ్ళు ఆగవు. సౌందర్యం- సౌందర్యం- ఒకటే సౌందర్యం ఆ కథనిండా - అని. అందుకనీ త్యాగభరితమైన 'ఆమె' సౌందర్యాన్నిగుర్తించి, కరిగి, నీరయ్యే వారందరి కోసమూ ఈ కథ. ●

# విస్మృత కథ సంకలనం ఆవిష్కరణ

ఒక నిర్దిష్ట లక్ష్యంతో తెలుగులో వచ్చిన తొలి సంకలనంగా 'విస్మృత కథ' సంకలనాన్ని పేర్కొనవచ్చుని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ వావిలాల సుబ్బారావు అన్నారు.

డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరు శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణల సంపాదకత్వంలో వల్లవి పబ్లికేషన్స్- విజయవాడ ప్రచురించిన 'విస్మృతకథ' సంకలనం ఆవిష్కరణ సభ గుంటూరులో జిల్లా గ్రంథాలయంలో ఆగస్టు 27వ తేదీన జరిగింది.

ఆవిష్కరణ సభకు అభ్యుదయ రచయితల సంఘం ఉపాధ్యక్షులు ప్రముఖ రచయిత డాక్టర్ పరుచూరి రాజారామ్ అధ్యక్షత వహించారు.

'విస్మృత కథ' సంకలనాన్ని ఆవిష్కరించిన సుప్రసిద్ధ కథా రచయిత భమిడిపాటి జగన్నాథరావు తన ప్రసంగంలో అన్నారు'

డాక్టర్ పాపినేని శివశంకర్ ప్రసంగిస్తూ

ఈనాడు ప్రసిద్ధమైనవిగా చెప్పబడుతున్న కథలకు ఏమాత్రం తీసిపోని కథలు ప్రచారం లోనికి రాకుండా పత్రికాపుటల మధ్యనే మిగిలి పోయాయని అటువంటి వాటిని కథాభిమానులకు పరిచయం చేయటానికే 'విస్మృతకథ'ను వెలువరించామన్నారు.

పెనుగొండలక్ష్మీనారాయణ






విస్మృత కథను ఆవిష్కరిస్తున్న రచయిత శ్రీ భమిడిపాటి జగన్నాథరావు. ఇంకా వేదికపై డాక్టర్ పరుచూరి రాజారామ్, డాక్టర్ వావిలాల సుబ్బారావు, డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరు శివప్రసాద్

కథ

# ఆత్మత్యాగం

## చలం

శీతారామయ్యని వేనుక్లబ్బులో ఎరుగుదును డిగ్రీలూ, మర్యాదా, ప్రాముఖ్యమైన ఆ క్లబ్బులో శీతారామయ్యనిచేర్చుకోడం ఎవరికి ఇష్టం లేదు. నాకుకూడా. కాని తనుచేరడం ఇష్టం లేదన్న వాణ్ని తంతానని బెదిరించి చేరాడు.. తంతానన్నాడంటే తన్ని తీరుతాడని అందరికీ తెలుసు. అతను చేరింతర్వాతనైనా అతన్నే మాలో ఒకణ్నిగా చేర్చుకోనేలేదు. అతని వైఖరి మాత్రం, 'మీరెంత వెధవలో నాకు తెలుసు. పంతానికి చేరాను గాని మీరు నన్ను అంగీకరించక పోవడమే నాకు మర్యాద' అన్నట్టు తిరిగేవాడు.

అతను గొప్ప రౌడీ కావడమే కాకుండా, తన తండ్రి దమ్మిడీలు లెక్కపెడుతో, సౌఖ్యాలు వొదులుకొని వెట్టిచాకిరీ చేసి కూడబెట్టిన గొప్ప ఆస్తిని ఒక స్త్రీ కోసం. అందులో అందంలేని రోడ్డు వేశ్యకోసం తగలేశాడనీ, ఇంక మిగిలిన కొంచెమూ, మోటారులో ఆమెతో తిరిగే సరదా కోసం సరిపుచ్చుతున్నాడనీ తెలిసింది. పిసినారి అని బతికి వున్నన్నాళ్లూ తిట్లుతిన్న అతని తండ్రి, ఇప్పుడు పబ్లిక్ సింపతీని సంపాదించాడు. ధనం భద్రంచేసుకుని, తక్కిన అల్లర్లు ఎన్ని చేసినా లోకం గౌరవిస్తుంది. ధనం వున్నప్పటి అతని గర్వం ధర్మంగా కనపడ్డది గాని, ధనం తరుగుతున్న కొద్దీ, అతని ముఖంతో గర్వం, సంతోషం. మనుషుల్ని చూసి అల్పభావం ఎక్కువవుతున్నాయి.

"ఏం చూసుకుని ఆ బోర్ల పడడం?"

"దాన్ని చూసుకునేమో?"

'తన రంభముందు కులుకమను. మనముందు ఎందుకు?"

"మనకి ఆ రంభ లేదు కదా, అని గావును'

' "అట్టే ఏం రంభ కాదు. వేను చూశాను.'

' "ఇదివరకు గుంటూరులో దాని ఖరీదు అరణాలూ, రెండు బంతి పువ్వులూ.."

"తాను వొలిచింది.."

శీతారామయ్య వొస్తున్నాడు. వూరుకున్నాము.

శీతారామయ్య నాకత్యంత ప్రియ మిత్రుడు. క్లబ్బుకి వెళ్ళడమంటే కలిగే సంతోషములో సగం అతన్ని చూస్తే ఆశలోనే వుండేది. కాని తన తండ్రి దమ్మిడీలు లెక్క పెట్టి సౌఖ్యాలు వదులుకొని వెట్టిచాకిరీ చేసి కూడతీసిన ఆ గొప్ప ఆస్తిని ఒక స్త్రీకోసం తగలేశాడనీ, యింక మిగిలిన కొంచెమూ, మోటారుకారులో తిరిగే సరదాకు సరి పుచ్చుతున్నాడనీ అనేవాళ్ళు క్లబ్బులో. కాని, ఆ స్త్రీ యెవ్వరో, ఎటువంటిదో,నాకు స్నేహమైన సంవత్సరానికి గావును, అతను క్లబ్బుకి రావడం మానాడు. జబ్బుగా వుందన్నారు. వూరువిడిచి వెళ్ళాడు తరువాత తిరిగి వచ్చాడని, అతని జబ్బు క్షయ అన్నారని, తెలిసింది. అతని మేడ, కారు వేలం పడ్డాయి. వూరి వెలపల ఏదో గుడిశెలో కాపురమున్నారని తెలిసింది. అతన్ని వెళ్ళి చూడాలనుకున్నాను. కాని అదివరకెన్నడూ అతని యింటికి వెళ్ళలేదు. అతని కిష్టముంటుందో లేదో, అందులో సరైన మర్యాద కాపురంకూడా కాదయ్యేను, అని వెళ్ళడం మానుకొన్నాను.

కాని వారం రోజుల్లోనే అతన్ని చూడడానికి రమ్మని కబురొచ్చింది, యింక డాక్టరైన తరవాత నా యిష్టాలతో పనేముంది?

మొదట ఆ కుటీరాన్ని చూడగానే నా కాశ్చర్యం వేసింది. బీద తనంవల్ల ఆ దేవిడీ వంటి మేడని వొదిలారా, లేక యీ కుటీరం అందాన్ని వొలిచి న్వప్నాలుకని యిట్లా సృష్టించుకున్నారా, అనిపించింది. యింటి ముందర పూలమొక్కలు, తడికలకు అతికించిన పూలకాయితాలు, చిన్న పటాలు, అద్దకాల పంజరాలు, రోగి మంచం దగ్గిర కొమ్మలూ, పూలు, అలికి ముగ్గులువేసిన నేల శుభ్రత అన్ని నాకు అహ్లాదాన్ని కలిగించాయి. ఆమె వొచ్చింది తలెత్తి ఆమెవంక చూడగానే తెలిసింది నా అంతరాత్మకి. నా జీవితంలో శాశ్వతమైన పదచిహ్నాన్ని వదలగల వకగొప్ప నిమిషం తటస్థమయిందని ఆమెలో అందం లేదు. పెద్ద కళ్ళు కావు, కోలముక్కు లేదు, గొప్ప అవయవాలు లేవు. ఆకర్షించే వక్షం లేదు. కాని ఏదో శుభ్రం, పవిత్రత, పాతివ్రత్యం, శోభ, ఆమె నావహించి వుంటుంది. ఆమె ముఖంలోని చిరునవ్వుతో పిలిచి స్నేహం చేసుకుంది నన్ను. లోకమంతా వొదిలి యిక్కడ వుంటే నేమని అప్రయత్నంగా తోచింది. ఈమెవల్ల అతనిదివరకెంత ఆనందాన్ని పొంది వుండాలో యీమెకాంతితో చిరునవ్వులతో తన గృహమూ, హృదయమూ యెంత గొప్పగా వెలిగి వుంటాయో అనుకున్నాను. రాత్రింబవళ్ళు యీమె పక్కన వుంటే, రోగినై మంచం మీద పడుకొని వుంటే నేం?

ప్రతి వుదయం నేనా గుమ్మంలో కాలు పెట్టడంతోటే పారిజాత పువ్వు వాసనా, వెన్నెల మెత్తదనమూ, ఆకాశ విశాలత్వమూ తోచేట్టు, ఆమె శాంతమైన చిరునవ్వూ కళ్ళలోని దయా నన్నావరించేవి. అక్కణ్ణించి కదలి వూళ్ళోకి వెళ్ళడం తలచుకుంటే, కణ్వాశ్రమంనించి, దండకారణ్యంలో ప్రవేశించడం లాగుండేది. ఆ ఆకర్షణాశక్తి, సౌమ్య శాంత స్ఫూర్తి, యెలా, యెందుకు ఆమెనుంచి ప్రసరించేవో నాకర్థంకాదు. అపురూపంగా కొందరున్నారు వారిలో ఒక్కొక్కరు యెప్పుడో తటాలున కంటపడగానే మురికి కాల్వలూ, నల్లని గోడలూ, ఎర్రని దుమ్మూ, నీటిలోంచి హఠాత్తుగా గంధర్వద్వారం తెరుచుకొని శీతలఛాయలతో ఆహ్వానించే సుందరారణ్యంలోకి వెళ్ళినట్టుంటుంది. విశాల మైదానము పైని నిర్మలాకాశాలూ, నీలంగా తళతళలాడే చల్లని తేటనీటి సరోవరాలూ, పెద్దవైన తెల్లని పద్మాలరేకులూ స్ఫురణకు వొచ్చి హృదయం చెప్పరాని బాధతో కొట్టుకుంటుంది. మనజన్మ సార్థకము చెయ్యగల ఆ సుందర విహారాలన్నీ వొదిలి అక్రమమూ, అసహజమైన మన సిగరెట్ జీవితాలతో అసంతృప్తి కలుగుతుంది. యెన్ని పూర్వ జన్మాల వాసనో పూర్వయుగాల్లో అనుభవించిన సహజ జీవనపు, నిగూఢ జ్ఞాపకమో, యీ కాఫీ హోటళ్ళూ డబ్బు నేగేసే రోగులూ, ప్రేమలేక కులాసాగా మాట్లాడే క్లబ్బు స్వార్థ స్నేహితులూ, ఐడోఫారం కంపులూ అన్నీ పోయి పొలాల మధ్యనో, చెరువు గట్లనో, పర్వతాగ్రాలనో నివసించాలని ప్రోత్సహించే రూపం ఆమెది.


ప్రొద్దువే ఆమె ముఖ దర్శనం చేసి తరువాత దినమంతా నా శక్తులన్నీ కృశించేవి. యేది చూసినా అసంతుష్టి, యెవర్ని చూసినా విసుగు, యీశ్వరుడి దివ్యమంగళ విగ్రహాన్ని చూసి, ఆ ఆనంద మనుభవించిన భక్తుడివలె యీ లోక సౌఖ్యాలు అల్పమనిపించాయి. యెవరు డబ్బు చేతిలో పెట్టినా, యెవరు కృతజ్ఞతతో నమస్కారాలు పెట్టినా వ్యర్థమనిపించింది. నా కీర్తిగాని, "చెక్‌బుక్" గాని నాకేమి సంతుష్టి నివ్వలేదు. దినంలో యెక్కడ పువ్వుల్ని చూసినా ఉదార కార్యాల సంగతి విన్నా, సంగీతం చెవిని తాకినా, ఆమె తీవ్రంగా జ్ఞాపకం వొచ్చి బాధ కలిగేది.

యీ అశాంతి అంతా ఆమె మీద మోహం వల్లనా, ఆమె మీద వాంఛా, నన్నిలా బాధిస్తోంది అని ఆలోచించా నొక రాత్రి ఆమెనన్నంగీకరించినట్టూ, నా హస్తాల్లో ఆమెను అదుముకున్నట్టూ భావించుకొని చూశాను. వెంటనే నా పైని, నా తుచ్ఛ కామం పైని పరమాసహ్యం కలిగింది. మంచి వాసనలతో మెత్తని రంగులతో నవ్వే గులాబీ పువ్వుని యెంగిలిముద్దు పెట్టుకున్నట్టే, ఆ చల్లని నిర్మలమైన చందమామను వేడి నిశ్వాసాలతో కావిలించుకున్నట్టే, శుభ వుదయ తేజస్సులో బూతులు మాట్లాడినట్లుంది. ఐతే నన్ను విడవని యీ వెర్రివేదనకి అర్థం ఆలోచించాను. కాని ఆ సమస్యకి అంతం కనపళ్ళే దా రాత్రికి . అందమూ యవ్వన ప్రారంభమూ, లేని ఆమెవల్ల ఈ బాధ అసహజమైన భ్రమ, విపరీతమైన మాయ. దానినుంచి తప్పించుకోవాలి. మనసులో ఆమెని 'ఎన్‌లైడ్' చేసుకుని కాంక్షించవలసిన కారణమేమీ లేదని నా మనసుకి నేనే గట్టి సమాధానం చెప్పుకుని ఆ రాత్రికి నిద్రపోయినాను. మర్నాడామెని చూడగానే; ఈమెలోని ఆ ఆకర్షణకి కారణం కనిపెట్టాలని వెతికాను. ఎందుకిట్లా హృదయాన్ని కలవరపెడుతూందని. నెమ్మదిగా చూసి ఆమె కళ్ళల్లో శాంతమైన సరస్సుల్లో ప్రతిఫలించే ఆకాశంకనపడ్డదో యెగిరే పక్షుల వొచ్చీరాని నడక ఆమె గమనంలో తొచిందో, వొత్తుగా పెరిగిన గడ్డినీడలు, ఆమె కుంతలాల గుబర్లలో కలిగాయో, దూరపు పర్వతాల నీలపు నునుపు వానలు కడిగిన తొలిపరిమళం, ఆమె దేహకాంతిలో కరిగినట్లుందోగాని; చూసినకొద్దీ, ఆలోచించినకొద్దీ, వలలో కొట్టుకునే పక్షివలె మనసు మరింత తీరని వాంఛతో తప్తమయింది.

ఒక వారంలో జీవితం దుర్భరమయింది. అభిమానము న్యాయమూ, స్నేహమూ, ధర్మమూ, అన్నీ త్యజించి, ఆమె పాదాలపై పడి కన్నీళ్ళతో--యేమడగను? యేమిటంటే, యేం కావాలంటే, ఏమని చెప్పను? నాకే తెలీదు! ఒకటిమాత్రం దృఢిగా నిశ్చయమయింది. ఆమె నాతో వుండాలి, నా యింటిని పువ్వులతోటే, కాంతితోటే నింపాలి అంత వరకునా వాంఛ స్పష్టము. ఆమెనుంచి దూరంగా జీవించడం దుర్భరం. కాని యెట్లా? యెవణ్ణో వొదిలి శీతారామయ్యతో వుండగా లేనిది అతన్ని వొదిలి నాతో నివసించ కూడదా? కాని నేను సంఘంపట్ల ఆ సాహసాన్ని చూపగలనా? పోనీ ఆ కుటీరంలోనేవుంచి రహస్యంగా ఛీ-ఛీ-నా మనస్సు తిరగబడ్డది. పోనీ ఆమెను వేరే కాపురమంటే వొస్తుందా? యిట్లాంటి మనుష్యులు, డబ్బుకే అమ్ముకుంటారు దేహాన్ని ఆత్మనీ. శీతారామయ్య యిప్పుడామెకి మహాభారం. కాని ఆమె గురించి అట్లాంటి ఆలోచనలు చేసిన పాపానికి నా నాలిక కొరుక్కున్నాను నా గుడ్డితనానికి, అహంభావానికి నామీద నాకు చాలా కోపంవచ్చింది. అతని బాధను తగ్గించినందుకై నేనేమడిగినా యివ్వదా అనిపించేది. కాని నమ్మిన నానించి అట్లాంటి కోరికరాగానే ఆమె కళ్ళు కష్టంతో కిందికి వాల్చడమూ, మెల్లిగా మొహంలోని దయ మబ్బులవలె కరిగి కోపకాంతి చంపల్ని ఆవరించడమూ, ఒక్కమాట లేకుండామెడతిప్పుకొని పెదిమ కొరికీ యేం చెప్పడమో తెలీక ఆమె వెళ్ళిపోవడమూ తోచి నన్ను బాధించేవి.

మెల్లిగా ఆమె వొంటిమీద సన్నని బంగారు గాజులూ, రాళ్ళ కమ్మలూ, చివరికి నానూ

అన్నీ మాయమవుతూండడం నాకు కనపడ్డది. ముందు నా బిల్లులు సగంధర తగ్గించాను. ఒకరోజు వొంటిం ్లో యెవరితోనో మాట్లాడు తూవుంటే నేను వినవలసివచ్చింది. ఆమె యెవరికో చీరెను యెనిమిది రూపాయల కమ్మింది. ఆ కొన్నా చీరెను నేను చూశాను. కొత్తదీ. యాభైరూపాయలుంటుంది. దానికి కొంచెం చిరుగుంది దాన్ని తీను కుని రూపాయలిమ్మని వాడు పోట్లాడుతున్నాడు. ఆ రూపాయలు ఖర్చు అయినాయి, లేవని యీమె అంటొంది. నేను నిశ్చేష్టితుణ్ణయి పోయినాను. యింటికి వెళ్ళి కవరులో యాభై




రూపాయలు పెట్టి తీసుకోమని బతిమాలు తూ, శీతారామయ్యకు పంపాను. మర్నాడు వెళ్ళగానే ఆ రూపాయలు నా చేతులో పెట్టింది మాట్లాడ్డానికి చేతకాక నేను వెళ్ళిపోయినాను.

"ద్రాక్షపళ్ళు ఆపిల్సు యిచ్చితీరాలా" అంది ఆమె కష్టంతో మర్నాడు.

"తప్పదు యింకా యివ్వాలి. మీస్థితి చూసి చెప్పక వూరుకున్నాను"అన్నాడు నోరు జారి.

అట్లా అనుకోకండి. యివ్వవలసినవన్నీ చెప్పండి ఫరవాలేదు" అంది.

ఈ కళ్ళతోనే ఆమె క్రమంగా చిక్కిపోవడం అనహాయంగా చూశాను. భోజనం మానే స్తోందని తెలుసు. ఎప్పుడూ వికాసంగావుండే ఆమె మొహం కొంచెంగా వాడింది. ప్రియుడి జబ్బులోనూ, కాలుస్తున్న దరిద్రంలోనూ శాంతంగా ఆనందంగా తిరుగుతూవున్న ఆమె నడక కొంచెం మందగించింది. గర్వంగా ప్రపంచాన్నీ, విధినీ, ధిక్కరించి నవ్వే ఆమె పెదవి కిందికి జారింది. నే నెట్లా భరించను?

ఆరోజు పొద్దున ఆమె నా దగ్గిరగా నుంచుంది.

"ఆయన వొంటో నెమ్మదిగానే ఉందండీ, మీరెందుకు వృధాగా రావడం?" అంది. రోగి మూలిగి నావంక గోడవేపు తిరిగ్గాడు. యేంచెయ్యను? "నరేలెండి. కాని, శీతారామయ్యగారితో కొంచెం మాట్లాడి వెడతాను"అన్నాను ఆమె వెళ్ళింది.

"నాదికాని వ్యవహారంలో జోక్యం కలగ జేసుకున్నందుకు క్షమించండి. నన్ను వైద్యుణ్ణిగా గాక స్నేహితుడిగా చూచుకోండి. మీకు యింకా నెలలకొద్దీ వైద్యసహాయం అవసరం. నా దగ్గర్నుంచి వుచితంగా తీసు కోకపోయినా, బాకీకింద చూసుకోండి. కాని, మందు మానితే మాత్రం తప్పకుండా మొదటిస్థితికి వస్తారు.'

అతని కళ్ళంబడి నీళ్ళొచ్చాయి.

"నా భార్య వొప్పుకోదు. ఇంక రాకండి మందు పంపకండి."

యింటికివెళ్ళి ఆలోచించి వరసగా నాల్గు రోజులు నాల్గు పదిరూపాయలనోట్లు పేరు లేకుండా పోస్టులో పంపాను.

పదిరోజులయింది, నేనా యింటివైపు వెళ్ళి. చేతి దూరంలోవున్న చల్లని కొబ్బరి తోటలోకి వెళ్ళడం చేతకాక, యెండలో కాళ్ళు కాలుతూ గంతులు వేస్తున్నట్టుంది నా జీవితం. ఆమె త్యాగాన్ని తలుచుకున్నప్పుడు నా మామూలు వుదారాన్ని, ధర్మాన్ని తలుచుకుని అంత నీరసపు పనులు చేసి నందుకు నాకు సిగ్గేసింది. గుండె నిబ్బరం చేసుకొని యిటూ అటూ చూడక దమ్మిడీల దగ్గర్నించి వేలదాకా పోగుచేసి, కుబేరుడు కావాలి; లేకపోతే సర్వమూ త్యాగంచేసి శుష్కదరిద్రుడు కావాలి. అంతేకాని మర్యా దకోసం, రూపాయి అర్థా చందావేసి, యేడిస్తూ చెల్లెళ్ళకు మేనపిల్లలకూ తిండిపెట్టి, చీరలిచ్చే బతుకు ఎందుకొచ్చింది? సుఖంగా భోజనం ముందు కూర్చున్నప్పుడు కాళ్ళు కడుపులో పెట్టుకొని పడుకున్న ఆమె శీలం జ్ఞాపకంవొచ్చి తిండి సహించదు. చీట్లపేకతో క్లబ్బులో కాఫీతాగుతో కాలం గడిపే సంతోషసమయాన రాత్రింబవళ్ళు నిమిషం శాంతినెరక్కచాకిరీ చేసే ఆమె జ్ఞాపకంవచ్చి పేకపారేసి లేచేవాణ్ణి. ధీరత్వాన్ని, దేశసేవను, త్యాగాన్ని పొగిడితే నాకు సిగ్గయి ఆమె సంగతి చెప్పాలని నోటివరకు వచ్చేది. ఒకసారి క్లబ్బులో కొంచెం కదిపాను. వెంటనే సార్వతీశం, "అదిరా....శీతారాముడి ముండేనా. దాన్నా సాటి తీసుకొస్తున్నావు. అవును, యీమధ్య నువ్వు 'ట్రీట్-----

'షటప్' అన్నాను కళ్లెర్రజేసి.

తరవాత యింక ఆ ప్రస్తావన రానేలేదు కాని క్లబ్బులో మాత్రం మనుష్యులామెను మరచిపోలేదు.

"యింకా వాడితోనే వుందిరా? అడుగు దొడుగు యింకా మూట కడతోంది గావును? యింతవరకు క్షవరం చేసింది. రోగాన్నంటిం చింది. యింక వదలకూడదూ, వాడి పీనిగని కళ్ళారా చూసికాని వదలదు."

ప్రజల హృదయా లిప్పుడు శీతారామయ్య కొసం ద్రవిస్తున్నాయి.

శాత్రులు కూడా పక్కన పడుకుని ప్రాణాలన్నీ బైటికి దగ్గే ఆ నిర్భాగ్యుడి ప్రతి ఆయాసంలోనూ, తన ప్రాణాలు పొయ్యేట్లు బాధపడే ఆమె జ్ఞాపకం వొచ్చింది.

★ ★ ★

నా శ్రమ తీరేట్టు పొలాలమీదనుంచి గాలి వేస్తోంది. నీళ్ళల్లోంచి కప్పలు వింతగా నా వంక చూస్తున్నాయి. చేతిలో బంతి పువ్వులూ, పొట్లపువ్వులూ అందంగా కనపడ్డాయి. ఆమె కుటీరంబైట నుంచుని వుంది. నన్ను చూడగానే యెందుకు మళ్ళీ వొచ్చావన్నట్టు చూసింది.

"వూరికే స్నేహానికి చూడ్డానికి వొచ్చాను. యిదీ యిష్టంలేకపోతే వెళ్ళిపోతున్నాను.'

చప్పున నా చెయ్యి పట్టుకుని ఆమె "మీరు రావడం మానేసిం తరవాత యెంతో వంటరిగా వుంది. ఆనందం కలిగించే అరగడియ కాలమూ జీవితంలోంచి మాయ. మయింది. తప్పకుండా రండి ప్రతిరోజూ రండి యిట్లా - సాయంత్రం-" అంత మాటలాడేనని చప్పున ఆగింది. కళ్ళంబడి వొచ్చే కన్నీటిని ఆపుకుని అవతలికి తిరిగి లోపలికి వెళ్లింది. శీతారామయ్య దగ్గర అరగంట కూచున్నాను. అతను అలసి కళ్ళుమూసుకొగానే, నన్ను బైట కుర్చీవేసి

కూచోపెట్టి కాఫీ ముందరపెట్టి నుంచుంది.

"మీరు కూచోరా"-కింద నాపరాయిమీద కూచుంది. యెంతో వాడిలిపోయింది. బుగ్గలు కిందికి వేళ్ళాడాయి. కళ్ళచుట్టూ నల్లటి లోతులు కనపడుతున్నాయి. పాప మీమెలా సాయంచెయ్యటం? నేను పంపిన వోట్లేమి చేసిందో, వుపయోగించినట్లు కనబడదు. ఇదివరకటి ప్రాభవంలో తావెరిగిన ధనవంతుల సంగతి మాటాలాడుకుంటూ, ఆ సాయంత్రపు గాలిలో కూచున్నాము. ఆమె నా దగ్గిరిగా, నా వంక ప్రేమతో చూస్తూ పక్కన కూచుంటే చాలదూ. శుష్కించిన ఆమె దేహంగాని వాలిన ఆమె బుజాలుగాని, రేగిన ఆ జుట్టుగాని, నా వాంఛను అర్థగించలేదు. ఆత్మనించి ఆత్మకి పిలుపులాగు తోచింది. అక్కడ కూచున్నంతసేపూ ఆమెని మనసుతో దగ్గిరికి పిలుస్తూనే వున్నాను.

"చివరికి మీకు వువ్వులన్నా తెచ్చి యివ్వాలనుకుంటాను. కాని కోపమొస్తుందని భయం."

"అవమానమంటే సహించలేను."

"అవమాన మేముంది?"

"నన్ను లోకువకట్టడం"

పెదిమ వొణికింది. యే పూర్వానుభవాలూ, కళ్ళు కనపడని పురుషత్వమూ, అహంభావంతో నిండి యే పశువులు కలిగించిన అవమానాలూ, యీమెనింత 'సెన్సిటివ్' చేశాయో?

"నే నెన్నటికీ మిమ్మల్ని అవమానం చెయ్యను. మిమ్మల్ని చూసి నప్పటినించి నా హృదయంలో కలిగిన పూజ్యభావమే నేను తెలియజేయ గలిగితే!-"

"మీరు నన్ను "మీ" రన్నప్పుడే తెలిసింది.

పాపం యీ హృదయం, యీ మలిన ప్రపంచంనించి, యెంత బాధ పడ్డదోకదా, ఈ అభిమానమెంత గాయపడ్డదోకదా, నన్నని వెన్నెలలో ఆమె సెలవు. తీసుకొని ఆనందంతో తృప్తితో ఇంటివేపు నడిచాను. ఆ మృదువైన వెన్నెట్లో యీసస్యాలూ, నీళ్ళూ, కీటకాలు తప్తినిపొంది ఆనందంతో విశ్రాంతి తీసుకున్నట్లు కనపడ్డది. నా జీవితానికి అర్థమూ ఫలితమూ, పొందినట్లయింది నాకా రాత్రి.

★ ★ ★

ఆనాడు ఆశ్వీజ పౌర్ణమి. నేను వెళ్ళేటప్పటికి అతనికి వ్యాధి యెక్కువగా వుంది. చాలా మూలుగుతున్నాడు. ఎప్పటివలె బైట జూకా మల్లె తీగ పక్కగా కూచున్నాము. మాటిమాటికి ఆమె లోపలికి వెళ్ళి వొస్తోంది.

"నేను వెడతాను పోనీ, లోపల కూచోండి"

"అంత అవసరంలేదు. యీ కాసేపన్నా-" ఆగింది.

సాయంత్రమిట్లా మీతో మాట్లాడం అలవాటయింది. బద్ధక మెక్కువయింది. మీ మూలానే."

అతనికింత జబ్బుగావున్నా ఆమె ముఖంలో కొంచెం వేదనలేదు. ప్రేమతప్ప. ధీరత్వమూ, అతనిపైని నిజంగా ప్రేమలేక విద్యుక్తమనే భావంతో పరిచర్య చేస్తోంది?

కాఫీ తెచ్చింది. యెన్నాళ్ళనుంచో అనాలనుకుంటున్న మాట అనేశాను.

"మీరు నాకు కాఫీ యిస్తే నేను రాను. పోనీ ప్రత్యుపకారంగా మందు పంపితే ఒప్పుకోరు మళ్ళీ. నాకు మాత్రం అభిమానం లేదు?"

"నేను మీ ఇంటికి వొచ్చినప్పుడు-" చప్పున సిగ్గుతో ఆగింది.

"వచ్చినప్పుడు....."

మాట్లాడలేదు.

"చెప్పరూ?"

"ఏం లేదు."

"చెప్పాలి." బలవంతం చేశాను.

"నేను యింటికి రావడమేమిటి?"

నాకు తట్టింది. యీమెని చూసి నాభార్య కూచోమనన్నా అంటుందా?

"వస్తే!"

"వొస్తే కాఫీ బదులు మందివ్వండి." అనబోయినాను. "లోపల దగ్గుతున్నాడు. వెళ్లి చాలాసేపు రాలేదు. చుట్టూ వెన్నెల సూర్యకాంతి మీద విజయం పొందింది. తొట్టిలో చెంగల్వలు విచ్చాయి. పావురాలు మూలిగాయి. గాలి ప్రారంభించింది. గడ్డిలో వచ్చిపూలు వూగాయి. చప్పున ఆమె పరుగెత్తుకొనిఒచ్చి 'ఒక్కసారి రండి' అంది.

శీతారామయ్య నెత్తురు కక్కుకుని పడిపోయినాడు. 'ఫిట్' తగ్గాక బైటకొచ్చి నుంచొని అంత అదుర్దాతోనూ, ధైర్యంతో తన నేమీ అంటనట్టు కావలసినది మాత్రం చేస్తూనుంచున్న ఆమె స్థయిర్యాని కాశ్చర్యపడుతూ నుంచున్నాను. సీత రాముడితో అడవికి పోయిందనీ, సావిత్రి యముడితో వాదులాడిందనీ, దుర్గమ్మ చీరెలు తగలపెట్టి ఖద్దరుపైను కట్టిందనీ, నూరమ్మగారు పాతివ్రత్యంమీద మహోపన్యాసమిచ్చిందని లొట్టలేసే మహానుభావుల పవిత్ర నేత్రాలకి దినదినమూ నిమిషనిమిషమూ, మనోవాక్కాయ కర్మల మీద యే పత్రికల్లోనూ పేర్లు పడని స్త్రీలు నిలిపే నిగ్రహం కనపడదు. యెంతకాలం సాధన చెయ్యకపోతే ఆ దృఢప్రజ్ఞ కలుగుతుంది? మొగుడు చచ్చాడని గుండెలు బాదుకొని ముఖారిరాగంలో రూపకతాళంలో పెంకు లెగరగొట్టే సావిత్రిభర్త పునర్జీవితుడైనాడంటే నమ్ముతారుగాని, యీ కులటలో పాతివ్రత్యమూ, నియమమూ గుర్తించగలరా?


"వెడుతున్నారా?" వెనకనే ఆమె వొచ్చి నుంచుంది. కంఠంలో వుండమంటున్న ఆదుర్దా కనపడ్డది.

"ఈ రాత్రి నన్ను యింజక్షను యివ్వనియ్యాలి."

"అంత యెక్కువగా వుందా?"

దగ్గరగా నుంచున్న ఆమెను 'ఫీల్' అవుతో నేను మాట్లాడలేదు

"చెప్పరూ, చెప్పండి. నాతో చెప్పడానికి సంకోచించకండి."



నా ధైర్యం మీకు తెలీదన్నమాట ధ్వనిస్తోంది. చెయ్యి మీద చెయ్యేసి కళ్ళుపైకెత్తి నా కళ్ళలోకి చూసింది. అధిక ప్రయత్నంలో నా చేతులకి బుద్ధి చెప్పుకుని దూరంగా జరిగాను.

"ప్రమాదమేమీ లేదు. యీ నెలరోజులూ మందు లేకపోవడంచేత మళ్ళీ వెనకదోవ పట్టింది. మీ కాయనపైన నిజమైన ప్రేమవుంటే మీ అభిమానాన్నన్నా త్యాగం చేసుకుని ఆయనకి మందు యిప్పించండి" అన్నాను.

నా కంఠంలోంచి పొర్లివచ్చే అనురాగ వాక్యాల్ని తొక్కిపడుతో కళ్ళు కిందికి వాల్చి. వూరుకుంది.

"నేను వెళ్ళి సామాన్లు తీసుకొస్తాను. మీరేం భయపడకండి"

వేళ్లాడుతున్న ఆ చేతిని మాత్రం తాక కుండా వెళ్ళలేకపోయినాను నిర్జీవ ప్రతిమవలె నుంచుని వుంది. తిరిగి చూడక బైలుదేరాను. యిట్లా రోజూ ఈమెను చూస్తోవుంటే యెట్లా భరించడం. ఆశలేని యీ వియోగ వ్యధకో? యెన్నటికన్నా లాభంలేదా-విసుగు కలగదా ఆమెకు? ధనము స్వేచ్ఛా ఆకర్షించవా? యెంత చిత్రమో! ఒక్కసారీ సీతారామయ్య అతని స్థితీ, వ్యాధీ నాకు మనసుకే తట్టలేదు. అతనొకవేళ చచ్చిపోతే ఆ పాడు ఆలోచనకి నాలిక కరుచుకున్నాను. కాని చచ్చిపోతే! ఆ తలపు నన్ను వొదల్లేదు. ఆ ఆశ కళ్ళముందు నించి తొలగదు. ఈ రాత్రి ఈ యింజక్షన్లే మాన్తే చాలామట్టుకు నాకు మనోరధసిద్ధి కలుగుతుంది. ప్రేమ దేనికన్నా సంకోచించదు కదా! అని నా నీచత్వానికి నవ్వుకొని వెళ్ళాను.


పదైంది. విశాలమైన వెన్నెల సముద్రంలో ఆ రోగి తల దగ్గి కూచున్న ఆ మహాపతివ్రతా మహాత్యంచేత ఆ గృహనావ తేలుతోంది. నా కాళ్ళచప్పుడు విని బైటికి వొచ్చింది.

"నిద్రపోతున్నారు. లేచిందాకా యిక్కడ కూచుందాము."

వెనక చిన్న పువ్వులపందిరీ, మొల్లల వానా, చిన్న కుటీరమూ, చుట్టూ పరిమితిలేని యీ తెల్లని సముద్రము నా పక్కన యీ వనితా - లోపలి అగ్నిని మరిచిపోగలిగితే! జ్వరము వంటి తాపంతో కుమిలిపోతున్నాను. "భయంలేదు కదా?" అంది నెమ్మదిగా. పాపం యింతవరకు శవం వలె పడివున్న ఆ మృతజీవి పక్కన వొంటరిగా కూచొని వుంది. యెలా యివ్వను శాంతం ఆ హృదయానికి? అతనికి జీవితమే నేనివ్వగలిగితే మళ్ళీ యీమె నాకు కనబడుతుందా? ఆ ఆలోచనలో యింకో మొహానికి స్థలం వుంటుందా? యింకో వాంఛ ఆ కళ్ళల్లో వెలుగుతుందా? యింకో గృహంలో ఆ కళ్ళు వెలుగుతాయా? యేమివ్వను యీమెకోసం? నా ధనం, మర్యాద, శీలం అర్పిస్తాను తృణప్రాయంగా.

"మాటలాడరేం?"

"నిజం మాటలాడతాను యేమీ అనుకోకండి. ఆ జాడ్యం కుదిరి ఆయన సంపూర్ణ స్వస్థత పొందుతాడనే ఆశలు మీరిదివరకే వొదులుకొని వుండాలి. అవునా?"




"ఏమో!"

సందేహమేమీ లేదని వుద్దేశ్యం పైకి నిజం చెవుతున్నా ననుకుంటున్నాను గాని, అంతరాత్మలో మాత్రం, ఆమెని బాధపెట్టాలని, అతనిమీద ఆ బంధనాన్ని గాయం చెయ్యాలని కోర్కె కలుగుతోంది.

"మేమెంత ప్రయత్నించినా కాలం జరుప వలసిన వారమే కాని యింకేంలేదు."

మాట్లాడిందామె. చంద్రుడు మెల్లిగా పైకి జరుగుతున్నాడు. నీడలు వూగుతున్నాయి. పున్నాగపువ్వొకటే తలమీద రాలింది.

"అది అతనికీ బాధే! మీకూ బాధే! కాదూ?" అని స్పష్టంగా అంది.

"యీ సేవే లేకపోతే నా జీవితమే ఆఖరు." అంది మళ్ళీ.

వూరుకున్నాను. ఏం మాట్లాడను? మెల్లిగా ఆమె కంఠంలోంచి యీ మాటలు వొస్తు న్నాయి. నాతోనో ఆ వెన్నెలతోనో చెప్పు కుంటోంది.

"తల్లి దండ్రులు లేనిదాన్ని, సమీప బంధువులు లేనిదాన్ని, భర్త నెరుగనిదాన్ని, యీ లోకానుభవం లేనిదాన్ని. నన్నొక్కనాడు మా బావ, నమ్మించి, ద్రోహంచేసి, తానను భవించి ఒక ధనికుడైన బంధువుడికి అమ్మాడు. వాడు తనవాంఛ తీర్చుకొని తను అప్పున్న ఒక మిత్రుడికి దానం చేశాడు. తరువాత అనేక పశువుల చేతుల్లో మారాను. అనేక విషయాలు నేర్చుకున్నాను. ఆ దుర్వృత్తి నుంచీ, ఆ పరమ నరకంనుంచీ విముక్తి పొందాలనుకున్నాను. కాని మోక్షమందలేదు. ధనమూ, మానమూ అందమూ మర్యాదలేని స్త్రీ జనప్రవాహముమధ్య తృణము. యే దారి పొయ్యేవాడి అనుగ్రహానికో దోసిలి వొగ్గవలసినదే. అప్పుడు అప్పుడు నేర్చు కున్నాను. అప్పుడు తీసుకున్నాను యీ ప్రతిజ్ఞ. యెవరినించీ అధర్మంగా ఒక్క దమ్మిడీ స్వీకరించకూడదని. అవ్యాజంగా అడగకుండా యిస్తారు. ధర్మాత్ములవలె ధనమూ, సహాయమూ, వద్దీతో శరీరము నించిదాని విలవను గ్రహిస్తారు. ఆ మహాపంకంలోంచి బైటపడే సాధనమెరక్క మృత్యువు నాశ్రయించ బొయ్యే నన్ను చెయ్యిజాచి పైకిలాగి వుద్ధవించారీయన. యీయన పురుషసింహం; దుర్మార్గులలో దుర్మార్గుడు, కాలాంతకుడు. అతను తన పట్టమహిషిని చేసుకుని తన స్నేహిత బృందం చేత నన్నారాధింప చేశాడు. నా మాట శాసనము. నా కనుసన్నలు రాజ్ఞీ వచనాలు, నా కోపము ప్రళయావసానంగా జరిపారు. యాభైవేల రూపాయల ఆస్తిని నన్నలంకరించేందుకు, నాకు నైవేద్యంగా, నా ఆనందానికై మూడేళ్ళలో వెదజల్లాడు. నా కదంతా కావాలా? కాని యెంత విలువైనది నాకు స్వల్పమని ఆయన వుద్దేశ్యపడి ధనవ్యయంలో తన ఆనందాన్ని అనుభవించారు. నా వల్ల నాకోసం యీనాడీ స్థితిలోపడ్డ యీయనకి నేనెంత సేవచేస్తే మాత్రం ఋణం తీర్చుకోగలవా?"

ఆ మాటలు నిద్రపొయ్యే దానివాటివలె మెల్లిగా ఆగిపోయినాయి. నేను ఆలోచిస్తూ కూచున్నాను. నీడ మా మీదికి జరిగింది. కొంగ ఒకటి చింతచెట్టుమీదనిలచి విడవ కండా యేడుస్తోంది. రోగి లేచాడు. లోపలికి వెళ్ళి యింజక్షను యిచ్చాము. నిద్రపోగానే బైటవొచ్చి కూచున్నాము. ఆ రాత్రి నాకామెనించి కదలాలని లేదు కాని వెళ్లితీరాలి. "నేను వెడతానింక." ఒద్దని ఆమె కళ్ళంటున్నాయనుకున్నాను. ఆమె మాట్లాడలేదు. నాకు కదలాలనిలేదు. ఏం మాట్లాడను? ఆమె కథ విన్నతరవాత ఏ మాటలు మాట్లాడడానికి పేలవంగా తోచింది. యింకో విధంగా ఓదార్చే సాహసంలేదు. ఒక మాటతో చూపుతో నన్ను మాడిస్తే, ఎన్నటికన్నా ఆ గాయం మానుతుందా?

"నా మాట వినండి. మందివ్వకపోతే అట్టేకాలం ఆశలేదు."

"ఆశ లేకుండా పోవాలనే కదూ మీ వుద్దేశ్యం?"

ఉలిక్కిపడ్డాను.

"ఏమిటదీ యిట్లా అంటున్నారు?"

"ఏం లేదు. యీ చాకిరి తప్పిపోయి నేను జీవితంలో సుఖం అనుభవించాలనిగా?"

"మొత్తానికి మీరు పడే శ్రమను చూస్తే మాత్రం భూలోకంలో యింత త్యాగమింకా వుందని సంతోషించాలో లేక మీవంటివారికింత యిబ్బంది తటస్థించినందుకు దుఃఖించాలో, తెలీటం లేదు."

"ఆ రెంటిలో ఒకటీ న్యాయంకాదు."

"నేను వెడతాను"

ఆమె మాటాడలేదు.

"ముందు సంగతి చెప్పండి. పంపనా మందు?"

అంగీకారంగా ఊరుకుంది.

"నేను ఉదయాన రానా?" కొంచెం వూరుకొని "సాయంత్రానరానా?" అన్నాను.

"ఆ, ప్రొద్దున్న ఆయనకోసం, సాయంత్రం మీకోసం సరేనా?-"

"మరి మీరు బిల్ పంపి తీరాలి."

"పంపితే?"

"సందేహ మక్కరలేదు. బిల్లులు తిరక్కొట్టంలెండి" అని చిన్నగా ప్రయత్న పూర్వకంగా నవ్వింది.

"పంపించ వద్దనరు గదా?"

"అది వీలు లేదు."

"బిల్లుల సంగతి చూచుకొందాం. కాని నిజంగా నయంగా వుండద్దూ?"

"చూద్దాం నయంగా వుండక యేం చేస్తుంది."

"నన్ను సంతోషపెట్టటానికి అంటున్న మిమ్మల్ని చూస్తే నాకు, నమస్కారం చెయ్యాలో జాలిపడాలో తెలీటంలేదు. మీరే మమ్మల్నిలా! జాగ్రత్త తీసుకోకపోతే యేమయ్యేవాళ్ళం" నా చేతులు రెండూ పట్టుకుని మొహాన అద్దుకుంది. ఆమెను రొమ్మున చేర్చుకుంటే ఆ నిమిషాన ఏమీ అనదనిపించింది కాని అంతనీచంగా "యెడ్వాన్‌టేజ్" తీసుకొంటానా?

* * *

తెలకాగానే బిల్ పంపమని అడిగింది. పంపేను. అధికమైన దరిద్రంలో యెలా యిస్తుంది? కుర్రవాడితో అయ్యగారిని భోజనం చేసి రాత్రికి ఒక్కసారి తప్పకుండా రమ్మని చెప్పిందట.

నా బైస్కిల్ చప్పుడు విని బయటికి వొచ్చింది. నా సైకిలు దీపం ఆ యింటి ముందువున్న తీగపైనించి ఆమె మీద పడ్డది. తెల్లని శుభ్రమైన చీర కట్టుకుంది. జుట్టు చాలా అల్లరిగా దువ్వి వువ్వులతో నవ్వుతున్నట్లు అలంకరించింది. యెన్నాళ్ళయింది నేనామెను అలా చూసి? యెక్కడిదో ఒక జాకెట్ కూడా తగిలించింది. యెందుకబ్బా యీ వేషం? ఏదన్న ప్రయాణమా? ఎవరన్నా వొస్తున్నారా? కాని పొట్టిచేతుల రెవికతో చంపల జీరలాడే జుట్టుతో చిరుగుల చీర కట్టుకుని రోజూ వున్నప్పుడే సహజంగా అందంగా కనపడేది. యెందుకు? ఇలా ఈ రాత్రికి ఈమెని శుభ్రం కమ్మని అడిగేటంత ఆరోగ్యం వచ్చిందా రోగికి? సరాసరి నన్ను వొంటింట్లోకి తీసుకెళ్ళింది. ఆ యింట్లో ఒక పక్క సామానంతా తీసేసి నులకమంచం వేసి, తన చేతులతో వుతికిన ముదతల దుప్పటి నొకటి దానిమీద పరిచి వుంచింది. పక్కన ఒక పాత కుర్చీ, గూట్లో కంచెంబులో ఆకులు, పువ్వులు, పక్కన తమలపాకులు వున్నాయి. అత్తరు వాసన కొంచెంగా యెక్కఖ్ఖంచన్నా వస్తోందేమో. నన్ను కుర్చీమీద కూర్చోమని తానెదురుగా సిగ్గు నటిస్తో నుంచుంది. అంతా కొత్తగా వికారంగా కనిపిస్తోంది నాకు. మాటాడితే యేమౌతుందో అన్నట్లు, అలానే కూచున్నాను. ఆమె అలానే నుంచుంది. గూట్లో దీపం నిదానంగా వెలుగుతోంది. పక్క గదిలో బాధతో కూడిన రోగి వూపిరి వినపడుతోంది. యింక వుండలేక "మాటాడవంరేం" అన్నాను.

"యేముంది, నేను సిద్ధంగానే వున్నాను' ' అని పక్క చూపులతో లేని సిగ్గుతో నన్ను పలకరించింది.

"యెందుకు" అన్నాను కొట్టుకుంటున్న హృదయంతో. నేను తనని అన్యాయంగా క్రూరంగా హాస్యం చేస్తున్నట్లు నావంక చూసింది.

"మీ యిష్టానికి" అన్నది.

తెలుస్తున్నది నాకు.

నా వొళ్ళు వొణికింది. కళ్ళు తిరిగాయి.

యేమిటిది? యెందుకిట్లా చేసింది? చప్పున ఆలోచించాను.

"యిట్లా కూచొండి."

మంచంమీద కూచుని నా చేతిమీద చెయ్యేసింది.


"యెందు కిట్లా?"

"మీ రుణం తీర్చుకునేందుకు."

"యిట్లానా?"

"నాకు చేతైన విధం యిదొక్కటే. యీ శూన్య గృహంలో యింకేమి లేదు."

"కాని మీ కంగీకారమేనా?"



"అంగీకారంతో ప్రసక్తిలేదు, ధర్మం"

"పోనీ నా కంగీకారమా?"

"మీ కిష్టంలేదా" అని వోరగా చూసింది.

"యెందు కనుకున్నారట్లా?"

"యింత లోకం చూసింతరవాత అంత మాత్రం తెలుసుకోలేనూ?"

"లోకానికి విరుద్ధంకూడా వుంటుం దక్కడక్కడ."

"కాని మీ విషయం నాకు నిశ్చయమే"

"యెప్పణ్ణించి?"

"మొదటి రోజునుంచి"

"ఐతే యింత ఆలస్యంచేసి బాధ పెట్టారేం?"

"యింద దరిద్రం పట్టందే?'

"కాని యిది ధర్మమా?"

"నా బోటి కులటలకు ధర్మమనేది వుందా?"

"మీరు నా మనసులో మహాపతివ్రతలలో వొకరని తెలీదూ?"

"అదే నిజమైతే వాంఛ యేమిటి?"

"నాలోని మగానిదా వాంఛ. నాది కాదు."

"దానికే చెల్లిస్తున్నాను, బిల్."

"నా యెడల అన్యాయం కాదూ?"

"యేది?"

"నీ హృదయంలేని దేహంతో నేను సంతృప్తి పొందు తాననుకోడం."

"మీరు పొందరు. మీలోని మృగం పొందుతుందనుకున్నాను."

"ఇధికాదు నేను కోరేది."

"యేది?"

"హృదయం."

"అది పరాయత్తం"

"మరి దేహాన్ని అమ్ముతున్నారా, వేశ్యవలె."

"వేశ్యకన్నా అధమంగా, వుచితంగా వుపకారం పొందమంటారా?"

"మిత్రుడి దగ్గిర్నించి"-

"నాకు మిత్రులు లేరు, వుండరు"

"ఐతే యింక మీ సహాయం మాకొద్దు."

"తప్పదా?"

"తప్పదు."

ఆలోచించాను నుంచుని.

"పోనీ బిల్ విలువ మాత్రం తీసుకొని వెళ్ళనిస్తారా? అన్యాయంగా యెక్కువ తీసుకోవడం తప్పుకదా?"

"సరే".

నా చేత్తో ఆమె చెంపల్ని తాకాను.

"యీ త్యాగానికై యెంత రక్తం మీ హృదయంలోంచి వొలికి వుంటుందో నాకు తెలుసు" అన్నాను.

"బిల్ తీరిందికాని మీ వాత్సల్యం తీరలేదు." దగ్గిరికి వచ్చి నా ముఖాన్ని పట్టుకుని ముద్దు పెట్టుకుంది.

"ఈ జన్మలో నేను పంపగల బిల్లుల మొత్తమంతా తీరింది" అన్నాను.

• ● •


Profitable
**TERMS**
&
Friendly
**CONDITIONS**
for
APCOB
DEPOSITORS

**APCOB announces enhanced interest rates on deposits and easy loan facilities to all its customers.**

| Period | Revised Rates |
|---|---|
| 46 days to 90 days | 11% |
| 91 days to less than 1 year | 12% |
| One year and above | 12.25% |

The interest rate on savings, Bank deposit remains unchanged at 6% p.a.

**APCOB's range of services to individuals:**

- Instant Loans against Gold oranaments
- Advances upto Rs.2 lakhs against approved equity shares
- Loans for traders
- Loans for purchase of cars
- Loans for purchase of consumer durables
- Housing loans under the National Housing Bank's HLA
- Secured overdrafts against NSCs etc.
- Clean overdrafts limits

APCOB

**The A.P. State Cooperative Bank Ltd.**
(A Scheduled Bank)
Head Office: Troop Bazar, Hyderabad - 500 001.
Phone: 590281-88

AKSHARA(H):APCOB:211:95